సాక్షి
ఖమ్మం
సోమవారం । 3 । జూలై । 2023



సభలో ప్రసంగిస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ



తెలంగాణ జనగర్జన సభకు భారీగా హాజరైన కాంగ్రెస్‌ శ్రేణులు

కట్టడి చేసినా.. కదం తొక్కి..

జనగర్జన సభకు సంద్రంలా తరలివచ్చిన కాంగ్రెస్‌ కేడర్‌

- అభిమాన సందోహం మధ్య కాంగ్రెస్‌ కండువా కప్పుకున్న పొంగులేటి
- ఖమ్మం వేదికగా ఎన్నికల శంఖారావాన్ని పూరించిన అధిష్టానం
- రూ.4 వేల పింఛన్‌ ప్రకటన చేసిన రాహుల్‌గాంధీ
- పాదయాత్ర ముగింపుతో భట్టికి ప్రశంసలతో సత్కారం
- జోష్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్‌ పార్టీ ఖమ్మం గుమ్మంలో నిర్వహించిన జనగర్జన సభ పార్టీ శ్రేణులు, అభిమాన సంద్రంతో కదం తొక్కింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్‌, నల్లగొండ, వరంగల్‌, ములుగు జిల్లాల నుంచి నేతలు, కేడర్‌ వెల్లువలా తరలివచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సభా ప్రాంగణానికి కేడర్‌ తరలిరావడం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వాహనాల తనిఖీల పేరుతో కట్టడి చేసినా.. సభ ఊహించని స్థాయిలో సక్సెస్‌ అయిందన్న ఆనందం ఆ పార్టీ నేతల్లో ఉంది. అభిమాన సంద్రం మధ్య రాహుల్‌గాంధీ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర చేపట్టిన సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కకు రాహుల్‌ ప్రశంసలు అందడంతో పాటు సత్కారం చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వేదికగా జరిగిన తెలంగాణ జనగర్జన సభ రాష్ట్ర ఎన్నికలకు శంఖారావంగా మారిందని ఆ పార్టీ శ్రేణులు జోష్‌తో ఉన్నాయి.



సభావేదిక వద్ద దప్పు కళాకారిణి

దండుగా కదలివచ్చి..

సభకు ఉమ్మడి ఖమ్మంతో జిల్లాతోపాటు నల్లగొండ, వరంగల్‌ ఉమ్మడి జిల్లాల్లోని హుజూర్‌నగర్‌, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్‌, మిర్యాలగూడ, మహబూబాబాద్‌, డోర్నకల్‌, ములుగు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున నేతలతోపాటు శ్రేణులు తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సభా ప్రాంగణానికి దండుగా కదలిరావడం ప్రారంభం కాగా, ఆరు గంటల వరకు కూడా వస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీల పేరుతో పోలీసులు వాహనాలను నిలిపారు. దీనిపై పార్టీ శ్రేణులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా చెక్‌పోస్టులను తీయడంతో వాహనాల రాక ప్రారంభమైంది. తల్లాడ నుంచి ఎస్‌ఆర్‌ గార్డెన్‌ వరకు, ఖమ్మంలోని ఇల్లెందు రోడ్డులో ట్రాఫిక్‌ జామ్‌ అయింది.



భట్టికి సన్మానం చేసి..

చివరి రోజు ఖమ్మంలో భట్టి పాదయాత్ర శ్రీశ్రీ సర్కిల్‌ నుంచి సభా వేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా టీపీసీసీ నేతలు భట్టిని అభినందించారు. ఆయనకు రాహుల్‌గాంధీ శాలువాతో సన్మానం చేశారు. అలాగే తెలంగాణలో భారీ పాదయాత్ర చేసిన భట్టికి ధన్యవాదాలు చెబుతున్నట్లు రాహుల్‌గాంధీ ప్రస్తావించడంతో కాంగ్రెస్‌ శ్రేణులు చేసిన నినాదాలు మార్మోగాయి. అంతేకాకుండా భట్టితో కరచాలనం చేసిన రాహుల్‌గాంధీ ఆయనను తీసుకుని వేదిక ముందుకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. ఈ ఏడాది మార్చి 16న ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రారంభమైన భట్టి పీపుల్స్‌మార్చ్‌ పాదయాత్ర 109రోజులు 1,360 కి.మీ.మేర సాగి తెలంగాణ జనగర్జన సభతో పూర్తయింది.

ఎన్నికల కదనరంగమై..

గత ఎన్నికల తర్వాత ఖమ్మం వేదికగా కాంగ్రెస్‌ భారీ ఎత్తున తెలంగాణ జనగర్జన సభ నిర్వహించింది. ఈ సభ నిజంగానే జనగర్జనగా మారిందని ఆ పార్టీ శ్రేణులు, నేతల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి అంతా ఈ సభ ఎన్నికల శంఖా రావమని, ఇక్కడి నుంచే బీఆర్‌ఎస్‌ పతనం ప్రారంభమవుతుందని వేదిక మీద ప్రకటించారు. దీంతో ఈ సభే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రేణులకు ఎన్నికల కదనరంగంగా మారిందని చెప్పవచ్చు. చాలాకాలం తర్వాత భారీ ఎత్తున సభ నిర్వహించడం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. మరోవైపు పార్టీ అధికారంలోకి రాగానే రూ.4 వేలు పింఛన్‌ ఇవ్వనున్నట్లు రాహుల్‌గాంధీ ప్రకటన చేశారు. దీంతో వచ్చే ఎన్నికల రీహార్సల్స్‌కు కాంగ్రెస్‌ ఖమ్మం వేదికగా ప్రధాన హామీ ఇచ్చినట్లు విశ్లేషణ జరుగుతోంది.



వేదికపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్‌ ఠాక్రే, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క, గద్దర్‌, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీ గౌడ్‌, పొన్నాల లక్ష్మయ్య, వీహెచ్‌, జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి

పొంగులేటిని ఆప్యాయంగా ఆహ్వానించి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీలోకి ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆయనకు పార్టీ కండువా కప్పారు. పార్టీ నేత మధుయాష్కీ, పొంగులేటితోపాటు ఎవరెవరు పార్టీలో చేరుతున్నారో వారి పేర్లను చదివారు. వారందరికీ రాహుల్‌గాంధీ పార్టీ కండువాలు కప్పారు. మరికొంత మందికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. పొంగులేటికి పార్టీ కండువా కప్పుతున్న సందర్భంగా ఆయన అభిమానులు జై శ్రీనన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీలో చేరుతున్న ముఖ్యనేతలను పొంగులేటితోపాటు రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీకి పరిచయం చేశారు. రాహుల్‌గాంధీ సభలో మాట్లాడుతూ కూడా పార్టీలోకి వచ్చిన పొంగులేటికి స్వాగతం అంటూ చెప్పారు. అలాగే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయం అంటూ పొంగులేటి గురించి మరోమారు ప్రస్తావించారు. దీంతో రాహుల్‌గాంధీ పీఎం, పీఎం అంటూ పొంగులేటి అనుచరులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

రాహుల్‌ను చుట్టుముట్టిన అభిమాన సంద్రం..

రాహుల్‌గాంధీ సభకు ముఖ్య అతిథిగా వస్తుండటంతో ఆయనను చూసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు సభా ప్రాంగణానికి పక్కనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ వద్దకు భారీగా చేరుకున్నారు. రాహుల్‌ హెలికాప్టర్‌ దిగి ఓపెన్‌టాప్‌ వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అభిమానులు ఆయనను చూసేందుకు వాహనం వెంబడి పరిగెత్తుకుంటూ రాగా పోలీసులు వారిని చెదరగొట్టారు. ఓ అభిమాని ఇచ్చిన పార్టీ జెండాను రాహుల్‌ చేత పట్టుకుని ఓపెన్‌ టాప్‌ వాహనంపై అభివాదం చేసుకుంటూ సభావేదిక వద్దకు వచ్చారు. 5.47 గంటలకు హెలిప్యాడ్‌ వద్దకు చేరుకున్న ఆయన 5.55 నిమిషాలకు వేదిక పైకెక్కారు. ఆ తర్వాత సభికులకు అభివాదం చేశారు. గన్నవరం నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన ఆ తర్వాత రాత్రి 7.30 గంటలకు సభాప్రాంగణం నుంచి రోడ్డు మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌తో బోనకల్‌, చిల్లకల్లు మీదుగా విజయవాడ సమీపంలోని గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. సభ ముగించుకుని వెళ్తున్న రాహుల్‌గాంధీ కాన్వాయ్‌ వెంట అభిమానులు ప్రాంగణం దాటే వరకు పరుగులు తీశారు.

ఎవరెవరు పాల్గొన్నారంటే..

సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, గద్దర్‌, భువనగిరి, నల్లగొండ ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మహేష్‌కుమార్‌ గౌడ్‌, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొదెం వీరయ్య, సీతక్క, సీనియర్‌ నేత రామసహాయం సురేందర్‌ రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్‌, మాజీ మంత్రులు జానారెడ్డి, సంభాని చంద్రశేఖర్‌, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్‌ అలీ, దామోదర రాజనరసింహ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, నేతలు కుసుమకుమార్‌, పున్నా కైలాష్‌నేత, పటేల్‌ రమేష్‌రెడ్డి, పోరిక బలరాం, పొన్నం ప్రభాకర్‌, భద్రాద్రి జెడ్పీ చైర్మన్‌ కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, బొర్రా రాజశేఖర్‌, సూత కాని జైపాల్‌, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, విజయాబాయి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



బాకా ఊదుతున్న ఆదివాసీ కళాకారుడు

సభ.. సాగింది ఇలా...



సభావేదిక వద్ద సెల్ఫీ పాయింట్‌

- **మధ్యాహ్నం 3గంటల వరకు** సభాస్థలి ఖాళీగా ఉండగా.. ఆతర్వాత కాంగ్రెస్‌ శ్రేణులు, పొంగులేటి అభిమానులు రావడం మొదలైంది.
- **3.30** కళాకారులు ధూంధాం ప్రారంభించారు.
- **సాయంత్రం 4.20 గంటలకు** వేదికపైకి టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి చేరుకున్నారు.
- **సాయంత్రం 5 గంటలకు** మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభావేదిక వద్దకు చేరుకుని అభిమానులు, కార్యకర్తల రాకను పర్యవేక్షించారు.
- **5.18 గంటలకు** సభాస్థలికి కార్యకర్తలు భారీగా చేరుకుంటుండడంతో ప్రసంగాలు మొదలుపెట్టారు.
- **5.44 గంటలకు** గన్నవరం నుండి రాహుల్‌గాంధీ వచ్చిన హెలికాప్టర్‌ సభామైదానం వద్దకు చేరుకోగా కార్యకర్తలు కేరింతలు కొట్టారు.
- **5.46 గంటలకు** హెలీకాప్టర్‌ దిగిన రాహుల్‌కు రేవంత్‌రెడ్డి స్వాగతం పలికి సభాస్థలికి తోడ్కొని వచ్చారు.
- రాహుల్‌ను చూసేందుకు పలువురు బారికేడ్లను తోస్తూ వెళ్లడంతో పోలీసులు చెదరగొట్టారు.
- హెలిప్యాడ్‌ నుండి రాహుల్‌ కారులో వస్తుండగా అభిమానులు, కార్యకర్తలు పరుగులు తీస్తుండడంతో ఆయన ఓపెన్‌ టాప్‌ మీదుగా అభివాదం చేశారు. కాంగ్రెస్‌ జెండా ఊపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.
- **5.55 గంటలకు** సభావేదికపైకి చేరుకున్న రాహుల్‌ను పొంగులేటి సత్కరించి శ్రీసీతారాముల ప్రతిమను అందజేశారు.
- **6 గంటలకు** సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగించుకుని జనగర్జన సభావేదిక పైకి వచ్చారు.
- **6.06 గంటలకు** పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాహుల్‌ కాంగ్రెస్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు.
- **6.14 గంటలకు** పొంగులేటి తన ప్రసంగాన్ని ప్రారంభించి 14 నిమిషాల పాటు మాట్లాడగా తాను కాంగ్రెస్‌లో ఎందుకు చేరానో వివరించారు.
- **6.27 గంటలకు** పీపుల్స్‌మార్చ్‌ పాదయాత్రను విజయవంతంగా ముగించిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను రాహుల్‌గాంధీ సన్మానించారు.
- **6.31 గంటలకు** భట్టి ప్రసంగం ప్రారంభించి 16నిమిషాల పాటు మాట్లాడగా పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను వివరించారు.
- **6.48 గంటలకు** రాహుల్‌ గాంధీ తన ప్రసంగాన్ని ప్రారంభించి 7.10 గంటల వరకు మాట్లాడారు. రాహుల్‌ గాంధీ హిందీ ప్రసంగాన్ని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు.
- రాహుల్‌ మాట్లాడుతుండగా గ్యాలరీల్లో ఉన్న కార్యకర్తలు, అభిమానులు వేదిక ముందుకు చేరుకుని పీఎం.. పీఎం అంటూ నినాదాలు చేశారు.
- కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచి అమలుచేస్తామంటూ రూపొందించిన ప్లకార్డులను రాహుల్‌, రేవంత్‌రెడ్డి, భట్టి, తదితర నాయకులు ప్రదర్శించారు.
- **7.14 గంటలకు** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించి 7.21 గంటలకు ముగించారు.
- **7.22 గంటలకు** సభ ముగించుకుని రాహుల్‌ గాంధీ సభావేదిక నుండి దిగి రోడ్డు మార్గంలో గన్నవరం బయలుదేరారు.

బెస్ట్‌ అవైలబుల్‌ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

గతంలో 1, 5వ తరగతుల్లో 99 సీట్లు.. ఈసారి 259సీట్లు

సాక్షి ఎఫెక్ట్‌..

ఖమ్మంమయూరిసెంటర్‌: షెడ్యూల్‌ కులాల అభివృద్ధి శాఖ ద్వారా బెస్ట్‌ అవైలబుల్‌ స్కూళ్ల(బీఏఎస్‌) పథకంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా బీఏఎస్‌ నోటిఫికేషన్‌ ఇవ్వని విషయమై 'సాక్షి'లో గతనెల 27న 'ఎన్నాళ్లు.. ఎదురుచూపులు?!' శీర్షికన కథనం ప్రచురితమైంది. పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించడమే కాక సీట్లు పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నట్లు కథనం ఇవ్వగా అధికారులు స్పందించారు. ఈమేరకు రెసిడెన్షియల్‌ విధానంలో ఐదో తరగతికి 131 సీట్లు, డే స్కాలర్‌ విధానంలో ఒకటో తరగతికి 128 సీట్లలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ జారీ అయిందని ఎస్సీ డీడీ సత్యనారాయణ తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందని, తల్లిదండ్రులకు డిగ్రీ, అంతకుమించి విద్యార్హతలు ఉంటే అనర్హులుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. 50 శాతం సీట్లు వ్యవసాయ కూలీల పిల్లలు, మొదటి తరంగా విద్యనభ్యసిస్తున్న పిల్లలకు కేటాయించినట్లు వివరించారు. అలాగే, అనాథలకు 20 శాతం, జోగిని పిల్లలకు 15 శాతం, కార్మికుల పిల్లలకు 15 శాతం రిజర్వేషన్‌ ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి మార్కుల జాబితా, ఒకటో తరగతిలో ప్రవేశానికి పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రంతో పాటు రేషన్‌ లేదా ఆధార్‌కార్డు జిరాక్స్‌, మీ సేవ నుంచి తీసుకున్న కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 15లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కాగా, గతంలో ఐదో తరగతికి 49, ఒకటో తరగతికి 50సీట్లుండగా.. ఈసారి వీటిని 131, 128 సీట్లకు పెంచడంతో తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకట్రావు

ఖమ్మం స్పోర్ట్స్‌: జిల్లా నుంచి గతంలో పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, ఇప్పుడు కూడా ఔత్సాహికులకు అదే స్థాయిలో శిక్షణ ఇస్తామని ఏఎస్పీ, బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా చైర్మన్‌ గంటా వెంకట్రావు తెలిపారు. ఖమ్మం సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్‌–13, 15, 17, 19 బ్యాడ్మింటన్‌ టోర్నీని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే ఉత్తమ క్రీడాకారులు కలిగిన జిల్లాగా ఖమ్మంకు పేరు ఉందని తెలిపారు. బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి ఎస్‌.ఉప్పల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాటమనేని రమేష్‌, పాటిబండ్ల యుగంధర్‌, చంద్రశేఖర్‌, జాతీయ బ్యాడ్మింటన్‌ రిఫరీ మల్లికార్జున్‌, రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, నాకౌట్‌ విధానంలో జరిగే ఈ పోటీలకు గాను అండర్‌–13, 15, 17, 19 బాలుర సింగిల్స్‌లో 58, డబుల్స్‌లో 17, బాలికల సింగిల్స్‌లో 23, డబుల్స్‌లో నలుగురు క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు.


చెట్టెక్కిన అభిమానం

జనరణగర్జన


రాహుల్‌తో రేవంత్, సీతక్క, పొంగులేటి తదితరులు

కాంగ్రెస్, పొంగులేటి అభిమానులు చేయి చేయి కలిపి జనగర్జనకు తరలి రాగా ఖమ్మం జనసంద్రంగా మారింది. హస్తం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది. కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి తదితరులు మార్గనిర్దేశనం చేయగా.. ఖమ్మం మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి చేరిక కొండంత బలాన్నిచ్చింది. ఖమ్మం నగర శివారులో ఆదివారం నిర్వహించిన జన గర్జన సభ రణగర్జనను తలపించింది.

– సాక్షి నెట్‌వర్క్




బారికేడ్లను తోసుకుని సభా వేదికవైపు..



భట్టి పాదయాత్రలో పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, సంపత్, పొన్నం


రాహుల్ గాంధీ అభివాదం..


వైరా రోడ్‌లో ట్రాఫిక్ జామ్..


సభకు తరలివస్తున్న జనం


సభా ప్రాంగణంలో మతాబుల మిలమిల..

గౌరవెల్లి నిర్వాసితుల ఫ్లెక్సీ


సభావేదిక సమీపాన గౌరవెల్లి నిర్వాసితులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మం అర్బన్: ఖమ్మంలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన తెలంగాణ ప్రజాగర్జన సభను పలువురు నిరసనకు మార్గంగా ఎంచుకున్నారు. ఈమేరకు 'భూమికి పరిహారం ఇవ్వకుండా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం గౌరవెల్లి నిర్వాసితులను జైల్లో పెట్టి బలవంతంగా ఇండ్లు కూల్చిన ప్రభుత్వం' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. నిర్వాసితులను రిమాండ్‌కు తరలిస్తుండడంతో ఇండ్లు కూల్చివేసిన ఫొటోలతో కూడిన ఈ ఫ్లెక్సీని రాహుల్‌గాంధీ, భట్టి విక్రమార్క కటౌట్ వద్ద కనిపించేలా ప్రదర్శించారు.

కేసీఆర్ శేషజీవితం చర్లపల్లి జైలులోనే..

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

ఖమ్మంమయూరిసెంటర్: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయలేదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. అంతేకాక వాటి పేరిట రూ.లక్షల కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడి, కుట్రలు చేసిన కేసీఆర్ శేషజీవితం చర్లపల్లి జైలులోనే గడపాల్సి ఉంటుందని తెలిపారు. ఫామ్‌హౌస్, ప్రగతిభవన్‌ల్లో కూర్చుని ఖమ్మం జనగర్జన సభను అడ్డుకునే కుట్రలు చేశారని ఆయన ఆరోపించారు.

రామసహాయం.. ప్రత్యేకం

ఖమ్మంమయూరిసెంటర్: జనగర్జన సభ వేదికగా కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ప్రసంగంలో మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి గురించి ప్రస్తావించారు. రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడని, కాంగ్రెస్ నుంచి ఆయన నాలుగు సార్లు ఎంపీగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని చెప్పారు. మూడో పార్లమెంట్‌లో ఎంపీగా పనిచేసిన వ్యక్తుల్లో ఆయన మాత్రమే ఇప్పుడు ఉన్నారని తెలిపారు. రామసహాయం సురేందర్‌రెడ్డి గురించి పొంగులేటి మాట్లాడే సమయాన ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి హాజరైన అభిమానులు కేరింతలు కొట్టారు.

రాహుల్‌గాంధీని ముద్దాడిన గద్దర్ !

ఖమ్మంమయూరిసెంటర్: జనగర్జన సభ వేదికపై ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీని ప్రజా యుద్ధ నౌక గద్దర్ ముద్దాడారు. వేదికపైకి చేరుకున్న గద్దర్‌కు రాహుల్‌గాంధీ స్వాగతం పలకగా.. ఆయన రాహుల్‌ను హత్తుకొని ముద్దాడారు. ఈ దృశ్యం చూసిన వారు కేరింతలు కొట్టగా.. వేదికపై ఉన్న నేతలు చిరునవ్వులు చిందించారు.

రిజర్వాయర్ వద్ద యువతి ఆత్మహత్యాయత్నం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ వద్ద ఆదివారం ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే, స్థానికులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన సదరు యువతి రిజర్వాయర్ వద్దకు చేరుకోగా తాను నీటిలో పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్‌ఫోన్‌లో చెబుతోంది. ఆమె మాటలు విన్న స్థానికులు అడ్డుకుని తమ సంరక్షణలో ఉంచగా.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. కాగా, ఆ యువతి వివరాలు, ఆత్మహత్యాయత్నానికి కారణాలు వెల్లడించేందుకు కుటుంబీకులు నిరాకరించారు.

మొక్కుబడిగానే పోలీస్ బందోబస్తు

- రాహుల్‌కు జెడ్ కేటగిరీ ఉన్నా పట్టించుకోని పోలీసులు
- ఎస్పీజీ కనుసన్నల్లో సభాస్థలి
- సభ ముగిశాక ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్

ఖమ్మంక్రైం/ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన తెలంగాణ ప్రజాగర్జన సభకు లక్షలాది మంది పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరుకాగా, పోలీసులు మాత్రం మొక్కుబడిగా విధులు నిర్వర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జెడ్ కేటగిరీ ఉన్నా ఆ స్థాయిలో పోలీసులు నిఘా ఏర్పాటు చేయలేదనే విమర్శలు వచ్చాయి. ఒక్కసారిగా వచ్చిన జనంతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయినా నియంత్రించలేని పరిస్థితి నెలకొని ఉంది. వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోవడంతో అటు పార్టీ శ్రేణులు, ఇటు సాధారణ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఎస్పీజీ నిఘా నీడలో..

జెడ్ కేటగిరి ఎస్కార్ట్ కలిగిన రాహుల్‌గాంధీ పర్యటనకు రెండు రోజుల ముందే 20 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఖమ్మం చేరుకున్నారు. సభాస్థలి, సభ ముగిశాక వెళ్లే రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. ఇక సభ జరుగుతుండగా కొందరు ప్రజల్లో కలిసిపోయి నిఘా వేశారు. రాహుల్‌గాంధీ వెంట ఐదుగురు కమాండర్లు బందోబస్తుగా హెలీకాప్టర్‌లో వచ్చారు. అనంతరం గన్నవరానికి రోడ్డు మార్గంలో వెళ్తుండగా ఆయనతోనే బయలుదేరారు.

కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు

పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో చేతులెత్తేశారని ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో పరిస్థితి చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. లక్షలాది మంది సభకు తరలిరావడంతో వారి వాహనాలను నియంత్రించడం కానీ పార్కింగ్ స్థలాలకు మళ్లించడంలో కానీ పోలీసులు శ్రద్ధ చూపలేదు. దీంతో వైరా రోడ్ అంతా ట్రాఫిక్ స్తంభించింది. సభ తేదీని ముందుగానే ప్రకటించినందున పోలీసులు రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని పలువురు పేర్కొన్నారు. సభ ముగిశాక వాహనాలన్నీ ఒకేసారి బయలుదేరడంతో రాత్రి 10 గంటల వరకు వైరా రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు కూడా అదే మార్గంలో వెళ్తుండడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అప్పటికే అక్కడ ఉన్న కాంగ్రెస్ వలంటీర్లు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంలో సహకరించారు. ఇక హెలీప్యాడ్ వద్ద కూడా ఎస్పీజీ కమాండెంట్లు మాత్రమే ఉండగా, స్థానిక పోలీసులు లేకపోవడంతో హెలీకాప్టర్ దగ్గరకు పలువురు వెళ్లి ఫొటోలు దిగేందుకు యత్నించారు. అయితే, చిన్నపిల్లలు, ఇతరులు తప్పిపోతే సమాచారం ఇచ్చేందుకు మాత్రం కొన్నిచోట్ల సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా ఇద్దరు అడిషనల్ డీసీపీలు, పది మంది ఏసీపీలు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినా పెద్దగా ఫలితం కనిపించలేదనే చెప్పాలి.


వైరా రోడ్డులో నిలిచిపోయిన బస్సులు, వాహనాలు


ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసులకు సహకరిస్తున్న కాంగ్రెస్ వలంటీర్లు

వాహనాలను ఎక్కడా అడ్డుకోలేదు..

– విష్ణు ఎస్.వారియర్, సీపీ

ఖమ్మంలో కాంగ్రెస్ జన గర్జన సభకు వెళ్తున్న వాహనాలను ఎక్కడ కూడా పోలీసులు ఆపలేదని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు వాహనాలను అడ్డుకున్నారని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని, జిల్లాలో ట్రాఫిక్ డైవర్షన్ మినహా చెక్ పోస్టులు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట వీహెచ్ ధర్నా

ఆపిన వాహనాలను విడిపించుకెళ్లిన మాజీ ఎంపీ


పీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ సభకు వెళ్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ పేరుతో స్టేషన్‌లో ఉంచిన విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆయన ఆదివారం ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట గంట పాటు ధర్నా చేశారు. వీహెచ్ హైదరాబాద్ నుంచి ఖమ్మం బహిరంగ సభకు వెళ్తుండగా పోలీసులు తమ వాహనాలను ఆపేశారని కార్యకర్తలు తెలిపారు. దీంతో ఆయన తమ కార్యకర్తల వాహనాలను స్టేషన్‌లో ఎందుకు ఉంచారని ఎస్‌ఐ వెంకటకృష్ణ, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తక్షణమే వాహనాలను వదిలేయకపోతే పెట్రోల్ పోసుకుంటానని చెబుతూ ధర్నా చేశారు. చివరకు వాహనాలను వదిలేయడంతో వీహెచ్ ఖమ్మం బయలు దేరారు.

బారికేడ్లను నెట్టేసిన రేణుకాచౌదరి

మండలంలోని కరుణగిరి వద్ద రోడ్డుపై ఏర్పాటుచేసిన బారికేడ్లను కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పక్కకు పడేశారు. కాంగ్రెస్ సభకు తమ పార్టీ శ్రేణులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు.

ముగిసిన భట్టి 'పీపుల్స్ మార్చ్'

- 109 రోజులు సాగిన సీఎల్పీ నేత యాత్ర
- చివరిరోజు శ్రీశ్రీ సర్కిల్ నుంచి పాదయాత్రగా జనగర్జన సభ వేదికపైకి..
- ప్రత్యేకంగా నిలిచిన కళాకారుల విన్యాసాలు

ఖమ్మంసహకారనగర్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం ఖమ్మంలో ముగిసింది. మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి నుంచి ప్రారంభమైన యాత్ర దాదాపు 109 రోజుల పాటు 1,360 కి.మీ. మేర కొనసాగింది. శనివారం ఖమ్మంకు చేరుకున్న భట్టి రాత్రి శ్రీశ్రీ సర్కిల్ సమీపాన బస చేశారు. ఆదివారం సాయంత్రం శ్రీశ్రీ సర్కిల్ నుంచి యాత్ర మొదలుపెట్టి తెలంగాణ జనగర్జన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈమేరకు సభలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అధికారంలోకి తీసుకురావడం కోసం సుదీర్ఘయాత్ర చేసిన భట్టిని రాహుల్ తన ప్రసంగంలో అభినందించారు. కాగా, చివరి రోజు మూడు కి.మీ. మేర సాగిన పాదయాత్రలో కాంగ్రెస్ ముఖ్యనేతలు దుద్దిళ్ల శ్రీధర్బాబు, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర పొడవునా డప్పు, కొమ్ము నృత్యాల కళాకారులు అలరించగా భట్టి సతీమణి మల్లు నందిని సైతం కదం తొక్కారు. మార్గమధ్యలో వేదపండితులు భట్టి దంపతులకు ఆశీర్వచనం అందజేశారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, శేఖర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మువ్వా విజయ్‌బాబు, పిడమర్తి రవి, బానోతు విజయాబాయి, సూతకాని జైపాల్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న రాహుల్‌గాంధీ

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

ఖమ్మంసహకారనగర్: త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ధీమా వ్యక్తం చేశారు. జనగర్జన సభావేదికపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతమ్, గిరిజన విభాగం చైర్మన్ బెల్లయ్యనాయక్, బీసీ విభాగం చైర్మన్ శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తదితరులు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏది కూడా అమలుచేయకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడోయాత్రకు మంచి ఆదరణ లభించగా.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేసిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర కూడా గొప్పగా సాగిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మహాప్రస్థానం పేరుతో పాదయాత్ర చేశారని నాయకులు గుర్తు చేశారు. ఏదిఏమైనా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాగా, సభకు జనం రాకుండా ఉండాలనే ఉద్దేశంతో పార్టీ శ్రేణులు, అభిమానులను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

పొంగులేటి చేతిలో కాంగ్రెస్ కబ్జా

- ఆయన వెళ్తే బీఆర్‌ఎస్‌కు నష్టం లేదు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మంమామిళ్లగూడెం: బీఆర్‌ఎస్ బహిష్కృత నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతిలో కాంగ్రెస్ కబ్జాకు గురైందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డిని తిరస్కరించిన ప్రజలు బహిరంగ సభను తేలిగ్గా తీసుకున్నారని తెలిపారు. ఆరు నెలలుగా అన్ని పార్టీల వైపు తిరిగినా ఆయన సభకు జనం రాకపోతే ఆ నెపం తమపై నెట్టే యత్నం చేస్తున్నారని విమర్శించారు. కాగా, పొంగులేటి కాంగ్రెస్‌లో చేరితే బీఆర్‌ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని చెప్పారు. ఇక ఐదు లక్షల మంది వస్తారని చెప్పినా ఆ స్థాయిలో జనం రాకపోవడంతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని, అడ్డుకున్నామని తమపై తప్పుడు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. తాము అడ్డుకుంటే ఖమ్మంలో చంద్రబాబు సభ, సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర జరిగేవా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావుతో పాటు చింతనిప్పు కృష్ణచైతన్య, ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, లింగబోయిన సతీశ్, కోడిరెక్క ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన నాయకులు

జనగర్జనలో వైఎస్ అభిమానులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన సభకు లక్షలాదిగా కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. వీరిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభిమానులు సైతం పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలానికి చెందిన పలువురు వైఎస్సార్, పొంగులేటి చిత్రాలతోపాటు జై జగన్ అనే నినాదం రాసి ఉన్న జెండాలను పట్టుకుని సందడి చేశారు.